‘మనూ’ ఐటీఐలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

- దరఖాస్తుల సమర్పణకు జూన్ 7 చివరి తేదీ
- ఐటీఐ ప్రిన్సిపల్ డాక్టర్ అర్షియా ఆజమ్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వ విద్యాలయంలో ఐటీఐ కోర్సుల్లో అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించినట్లు ‘మనూ’ ఐటీఐ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపల్ డాక్టర్ అర్షియా ఆజమ్ గురువారం తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరంలో ఈ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఉర్దూ భాష లేదా ఉర్దూ మాధ్యమం ద్వారా ఎస్‌ఎస్‌సీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అవకాశం కలిప్తామన్నారు. డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, రిఫ్రిజిరేటర్ అండ్ ఎయిర్ కండీషనింగ్, ప్లంబింగ్ వంటి అయిదు ట్రేడ్‌లు అందుబాటులో ఉంటాయన్నారు. మరింత సమాచారం కోసం 040–23008428, 9440692452లో సంప్రదించాలని కోరారు. ఇదిలావుండగా బెంగళూరు ఐటీఐలో దరఖాస్తులను సమర్పించడానికి చివరి తేదీ జూన్ 3గా నిర్ణయించామన్నారు. బెంగళూరు ఐటీఐ వివరాల కోసం 080–29742261లో సంప్రదించాలన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా


రామచంద్రాపురం సబ్‌స్టేషన్‌లో రాత్రి విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వినియోగదారులకు నిరంతర విద్యుత్‌ను అందించేందుకు విద్యుత్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా అధికారులు, సిబ్బంది రాత్రి సమయంలో సైతం సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. వేసవి కావడంతో రాత్రి సమయంలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. అంతరూ ఏసీలను అమర్చుకుంటున్నారు.

రాత్రిపూట విధుల్లో సిబ్బంది

రాత్రి సమయంలో ఎక్కువ శాతం ఏసీలను ఆన్‌చేయడంతో ఒక్కసారిగా సబ్‌స్టేషన్‌పై లోడ్ పడి ట్రాన్స్‌ఫార్మర్‌లు ట్రిప్ అవుతున్నాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. పూర్తి స్థాయిలో దీన్ని నివారించేందుకు ఏఈ స్థాయి అధికారులతో పాటు సిబ్బంది రాత్రి సమయంలో విధులను నిర్వహిస్తున్నారు. ఏదైనా విద్యుత్ సమస్య వచ్చిన వెంటనే ఆ సమస్య ఎంత సేపటిలో పరిష్కరిస్తారో కాలనీలకు సంబంధించిన వాట్సాప్ గ్రూప్‌లలో స్థానిక అధికారులు సమాచారం ఇస్తున్నారు. రాత్రి సమయంలో విద్యుత్ పోయిన వెంటనే చర్యలు తీసుకుంటున్నారు. రాత్రి సమయంలో అంతరాయం లేని విద్యుత్‌ను అందిస్తున్న అధికారులకు, సిబ్బందికి ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

ట్రాఫిక్ సమస్య .. స్పెషల్ డ్రైవ్

కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో ట్రాఫిక్ నియంత్రణపై అధికారుల దృష్టి


కేపీహెచ్‌బీ ప్రధాన రహదారిలో వాహనాల రద్దీ


భాగ్యనగర్‌కాలనీ జాతీయ రహదారిపై బారికేడ్ల ఏర్పాటు

ఆల్విన్‌కాలనీ: ట్రాఫిక్ సమస్య పరిష్కారంపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలను పరిశీలించి ఆయా ప్రాంతాల్లో, మూల మలుపుల్లో, విరివిగా ట్రాఫిక్ జామ్ అయ్యే కూడళ్లల్లో నియంత్రణకు చర్యలు చేపట్టారు. నో పార్కింగ్ జోన్‌లో వాహనాలను పార్కు చేయరాదని , చేస్తే పెనాల్టీలు విధించాల్సి వస్తుందని హెచ్చరించారు. కూకట్‌పల్లి ముంబాయి జాతీయ రహదారిలోని మెట్రో పిల్లర్స్ యూటర్న్‌లు, భాగ్యనగర్‌కాలనీ మెట్రోస్టేషన్, ఉషా ముళ్లపూడి రోడ్డు, వివేకానందనగర్ చౌరస్తా, కూకట్‌పల్లి బస్టాప్, ఎన్‌కెఎన్‌ఆర్ గార్డెన్ యూటర్న్, వై జంక్షన్, జేఎన్‌టీయూ చౌరస్తాలలో ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ ఉన్నతాధికారులు సిమెంట్, ఐరన్ బారికేడ్‌లను ఏర్పాటు చేశారు. రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్న దృష్ట్యా రాంగ్ పార్కింగ్ చేసే వారికి జరిమానా విధించటానికి పోలీస్ అధికారులు ముందస్తుగా ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టారు. కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో వాహనాల రద్దీ పెరగటం .. రోడ్ల విస్తరణ లేక ఎక్కడికక్కడ ట్రాఫిక్ ఆగిపోతోంది. ఇక సర్వీస్ రోడ్లలో కార్లు, ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయకుండా ఆయా వ్యాపార సముదాయాల నిర్వాహకులు పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలని ట్రాఫిక్ అధికారులు సూచించారు.

ట్రాఫిక్ సజావుగా సాగేలా కృషి



ప్రధాన కూడళ్లపై దృష్టి సారించి ఎప్పటికప్పుడు ట్రాఫిక్ లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే జీహెచ్‌యంసి అధికారులకు యూ టర్న్‌లు, డివైడర్స్, జీబ్రా లైన్లు వంటి వాటి మార్పు చేర్పుల కోసం వారి దృష్టికి తీసుకెళ్లటం జరిగింది. కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో ట్రాఫిక్ సజావుగా సాగేలా కృషి చేస్తున్నాం.
–కె. శ్రీనివాసులు, ట్రాఫిక్ సీఐ, కూకట్‌పల్లి

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్


రాయదుర్గంలో నోరు తెరుచుకున్న మ్యాన్‌హోల్

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలోని ఎస్సీ బస్తీలోని మ్యాన్‌హోల్‌పై మూత లేదని స్థానికులు తెలిపారు. బస్తీలోని మ్యాన్‌హోల్‌పై మూత లోపలికి పడిపోయింది. స్థానికు ఇక్కడ కర్రలను పెట్టి హెచ్చరిక చేస్తున్నారు. కాగా వర్షాకాలంలో రోడ్లపైకి నీరు వస్తే మ్యాన్‌హోల్ కనిపించక అందులో ఎవరైనా పడిపోతే పరిస్థితి ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వర్షాకాలం ఆరంభంలోనే మ్యాన్‌హోళ్లపై మూతల ఏర్పాటు, రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని వారు సూచిస్తున్నారు. అధికారుల దృష్టికి తెస్తే కూడా పట్టించుకోకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వెంటనే స్పందించి మ్యాన్‌హోల్‌పై మూతను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేత


ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. భారతీనగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీకి చెందిన తనూజ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సీఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన లక్ష రూపాయల ఎల్‌ఓసీని తనూజ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



శేరిలింగంపల్లి: విద్యుత్ సంబంధిత మరమ్మతుల కారణంగా శుక్రవారం డైమండ్ హిల్స్, జవహర్ నవోదయ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు నల్లగండ్ల ఏఈ వెంకటనారాయణరెడ్డి తెలిపారు.

- 11 కేవీ డైమండ్‌హిల్స్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు డైమండ్ హిల్స్, సాయిరాం కాలనీ, జవహర్ నవోదయ స్కూల్ సమీపంలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.
- 11 కేవీ జవహర్ నవోదయ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5గంటల వరకు నల్లగండ్ల, అపర్ణ అపార్టుమెంట్ ఎదురుగా ఉన్న నల్లగండ్ల హుడా కాలనీ, కంచ గచ్చిబౌలిలలో విద్యుత్ ఉండదని ఏఈ తెలిపారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: 11 కేవీ జీపీఆర్‌ఏ విద్యుత్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జీపీఆర్‌ఏ క్వార్టర్స్, ఈపీటీఆర్‌ఐ, ఇందిరానగర్, గ్రీన్‌ల్యాండ్ కాలనీల్లో విద్యుత్ ఉండదని ఏఈ వేణుగోపాల్ తెలిపారు.

- 11 కేవీ జయభేరి విద్యుత్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఏపీహెచ్‌బీ కాలనీ, ర్యాడిసన్ హోటల్, డీఎల్‌ఎఫ్ గేట్ నెంబర్ 1,2,3 ప్రాంతాలలో..
- 11 కేవీ వాసవి విద్యుత్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు హెచ్‌ఎండీఏ, హెచ్‌జీసీఎల్, గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్స్, సంధ్యా ఎలైట్, గోల్ఫ్‌వ్యూ అపార్ట్‌మెంట్స్, నానక్‌రాంగూడ ప్రాంతాలలో..
- 11 కేవీ కీస్టోన్ విద్యుత్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు జన చైతన్య లే అవుట్, కీస్టోన్ స్కూల్ ప్రాంతాలలో..
- 11 కేవీ శ్రీరామాస్కూల్ విద్యుత్ ఫీడర్ పరిధిలో.. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు నానక్‌రాంగూడలోని శ్రీరామ స్కూల్ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

కొండాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..

గచ్చిబౌలి: కొండాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి అన్నమాచార్య విద్యుత్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అన్నమాచార్య టెంపుల్, పరిసర ప్రాంతాలు, హైటెక్స్ ప్రధాన గేటు ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజశేఖర్‌రెడ్డి వివరించారు.

- 11 కేవీ వసంతసిటీ విద్యుత్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వసంతవిల్లాస్, సైబర్ విలేజ్, సైబర్ వ్యాలీ, సంకల్ప్ అపార్ట్‌మెంట్స్, పరిసరప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలో..

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

- కళ్యాణ్‌గార్డెన్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు మాతృశ్రీనగర్ కొంతభాగం, మాధవనగర్, అంబేద్కర్‌నగర్, నందినగర్, మియాపూర్ మెయిన్‌రోడ్డు ఏరియాలలో విద్యుత్ ఉండదన్నారు.
- ఆదిత్యనగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ఎస్‌సీబీ కాలనీ, ఆదిత్యనగర్, కృష్ణ కాలనీ, ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్ ప్రాంతాలలో..

తారానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

- ఇంజనీర్స్ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు ఇంజనీర్స్ ఎన్‌క్లేవ్, ఓల్డ్ పోలీస్‌స్టేషన్ రోడ్డు, గంగారం విలేజ్ ఏరియాలలో విద్యుత్ ఉండదన్నారు.
- శాంతినగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు శాంతినగర్, కమిడీ హాస్పటల్, హుడా కేఫ్ దగ్గర, వెంకటాద్రినగర్, జీహెచ్‌ఎంసీ మీసేవా లేన్, విద్య నర్సింగ్ హోమ్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ సుమన్ ఓ ప్రకటనలో తెలిపారు.

వేమన కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో..

- సురక్ష ఫీడర్ పరిధిలో ..ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు వేమనరెడ్డి కాలనీ రోడ్ నెంబర్ 9, పద్మజకాలనీ, విద్యానగర్, రాజేందర్‌రెడ్డి నగర్, సురక్ష ఎన్‌క్లేవ్, అపర్ణ హిల్ పార్కు ఏరియాలలో విద్యుత్ ఉండదని ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.
- కెఎస్‌ఆర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు కెఎస్‌ఆర్ ఎన్‌క్లేవ్ రోడ్ నెంబర్ 1 నుంచి 17, అంగారా దగ్గర నుంచి అపర్ణ హిల్ పార్కు వైపు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

మియాపూర్‌లో..

మియాపూర్: గోకరాజు ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు మయూరినగర్, గోకరాజు కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ హరీష్‌సింగ్‌తెలిపారు.

మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో..

లోటస్ కాలనీ, జేఎస్‌ఆర్ విగ్రహం ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు బొల్లారం రోడ్డు, డీ మార్ట్ ఏరియా, నాగార్జున ఎన్‌క్లేవ్, బస్ బాడీ ఏరియా, అదేవిధంగా మధ్యాహ్నం 2.30 నుండి 4.30ల వరకు ప్రగతి ఎన్‌క్లేవ్, నీలిమా గ్రీన్, డూప్లెక్స్ హౌజెస్, ఆర్వీ నిర్మాణ్ అపార్ట్‌మెంట్, లా – గార్డీనియా అపార్ట్‌మెంట్, రాధామాధవ్ అపార్ట్‌మెంట్, శ్రీలక్ష్మి అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ రాజ్ కుమార్ తెలిపారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు


భవనాన్ని కూల్చి వేయిస్తున్న హుడా అధికారులు

మియాపూర్: ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హుడా సీఐ తిరుపతి తెలిపారు. మియాపూర్‌లోని 101 సర్వేనంబర్ గల ప్రభుత్వ భూమిని ఆక్రమించి కట్టిన కట్టడాలను గురువారం హుడా అధికారులు కూల్చివేశారు. దీప్తిశ్రీనగర్ పక్కనే గల 101 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మించిన 15 నిర్మాణాలను జేసీబీ సహాయంతో హుడా పోలీసుల ఆధ్వర్యంలో కూల్చివేశారు. ఈ సందర్భంగా హుడా అధికారులు మాట్లాడుతూ... కూల్చివేసిన చోట మరలా తిరిగి నిర్మాణాలు చేపడితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కూల్చివేతలో సైట్ ఎస్టేట్ ఆఫీసర్లు గౌతం, క్రాంతి, హుడా ఎస్‌ఐ సంతోష్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మొగులమ్మ బస్తీ సమస్యలు పరిష్కరిస్తా


ఎమ్మెల్యే గాంధీని కలిసిన బస్తీవాసులు

ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని మొగులమ్మ బస్తీలో సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కాలనీవాసులు గురువారం ఎమ్మెల్యే గాంధీని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ మొగులమ్మ బస్తీలో గత కొన్ని రోజులుగా మంచినీటి సమస్య ఉందని, తక్కువ ప్రెషర్‌తో మంచినీరు వదులుతున్నారని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను త్వరగా పరిష్కరించాలన్నారు. ప్రజలకు సరిపడా నీటిని అందించాలన్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని, కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌యస్ నాయకులు జాన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

కలుషిత నీరు తాగేదెలా..?



రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతీనగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎజీ కాలనీలో గత కొంతకాలంగా మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నారు. రోజు విడిచి రోజు నీటిని వదులుతున్నారు. అయితే ఆ నీటిలో పాచి రావడంతో ఈ నీరు ఎలా తాగాలని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీకు చెందిన భెల్ రిటైర్డ్ అధికారి ధర్మప్రకాష్ గురువారం మిషన్ భగీరథ నీరు సరఫరా కావడంతో ఆ నీటిని సీసాలో పట్టుకున్నారు. నీటిలో పెద్ద ఎత్తున పాచి రావడంతో ఆయన ఆందోళన చెంది ఈ విషయాన్ని కాలనీ సొసైటీ సభ్యుల దృష్టికి తీసుకుపోయానని తెలిపారు. ఈ నీటిని ఫిల్టర్ చేస్తే మొత్తం పాచి కనపడుతుందని రెండు నెలలుగా ఈనీటినే తాగుతున్నామని తెలిపారు. ఇలాంటి నీరు తాగడం వలన రోగాలు వచ్చే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు చేసిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ఎస్‌ఐ మల్లయ్య కథనం ప్రకారం... అమీన్‌పూర్ పరిధిలోని లింగమయ్య కాలనీలో నివాసముంటున్న రమేష్‌గౌడ్ భార్య అనుపమ ఈనెల 28వ తేదీ సాయంత్రం రామచంద్రాపురంలో ఉన్న తన సోదరుడి ఇంటికి వెళ్లి, అదే రోజు తిరిగి రాత్రి ఇంటికి వచ్చింది. సోదరుని ఇంటికి ఎందుకు వెళ్ళావని భార్యతో రమేష్ గౌడ్ గొడవపడ్డాడు. అనంతరం ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు.దీంతో భార్య అనుపమ భర్త కోసం తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త అదృశ్యంపై బుధవారం రాత్రి అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల భద్రత కోసమే ‘మై ఆటో ఈజ్ సేఫ్’

జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు


స్టిక్కర్‌ను చూపుతున్న జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు, పక్కనే డీఎస్పీ రవీందర్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: మహిళల భద్రత కోసమే మై ఆటో ఈజ్ సేఫ్ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు అన్నారు. గురువారం పటాన్‌చెరు పట్టణంలోని మైత్రి గ్రామంలో నిర్వహించిన మై ఆటో ఈజ్ సేఫ్ అనే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు విచ్చేసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి , పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌రెడ్డి, ట్రాఫిక్ సిఐ శ్రవణ్ కుమార్‌లతో కలిసి ఆటోలకు స్టిక్కర్లను అతికించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు ఎస్పీ సంజీవరావు మాట్లాడుతూ... ప్రయాణికులు ఆటో ఎక్కే ముందు స్టిక్కర్‌ను చూసుకోవాలన్నారు.ఆటో డ్రైవర్ అనుచిత ప్రవర్తన లేదా వేధింపులు వంటి సమస్యలు ఎదురైతే, డ్రైవర్ సీటు వెనుక ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వారి ఫోన్‌లో డ్రైవర్ సమాచారాన్ని పొందవచ్చన్నారు. ‘షీ–టీమ్‌కు కంప్లయింట్ ఎమర్జెన్సీ, రేటింగ్ యువర్ ఆటో వంటి ఆప్షన్‌ల ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఆ ఫిర్యాదు నేరుగా సంగారెడ్డి జిల్లా పోలీస్ ఆఫీస్ కంట్రోల్ రూమ్‌కు చేరుతుందన్నారు.దీంతో కంట్రోల్ రూమ్ పోలీసులు సమస్యను స్థానిక పోలీసులకు తెలియజేసి పరిష్కరిస్తారని తెలిపారు. పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం


జెండా ఎగరవేస్తున్న సంఘం కూకట్‌పల్లి మండల అధ్యక్షుడు రాములు తదితరులు

ఆల్విన్‌కాలనీ: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కూకట్‌పల్లి భవన నిర్మాణ కార్మిక సంఘం అడ్డాలో సీఐటీయూ జెండాను గురువారం ఆవిష్కరించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం కూకట్‌పల్లి మండల అధ్యక్షులు బి. రాములు మాట్లాడుతూ ఐక్యత పోరాటం అనే నినాదంతో 1970 మే 30న సీఐటీయూ ఆవిర్భవించిందన్నారు. కార్మిక వర్గం ఎదుర్కొంటున్న రోజువారీ సమస్యలకు, వారి హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. అసంఘటిత కార్మికుల కనీస వేతనాలు, హక్కులు అములు చేయలేదని పెరిగిన ధరల అనుగుణంగా కార్మికులకు కనీసం వేతనం 26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రమేష్ లాజర్, రాజు, శ్రీను, శ్రీశైలం, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

బీటలువారుతున్న బీఆర్‌ఎస్ !

‘బండ్లు ఓడలవుతాయి... ఓడలు బండ్లవుతాయనే’ సామెత అక్షరాల రాజేంద్రనగర్ నియోజకవర్గ రాజకీయాల్లో కనపడుతోంది. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో జీహెచ్‌ఎంసీ పరిధి పక్కన పెడితే నార్సింగి, బండ్లగూడ, శంషాబాద్ మున్సిపాలిటీల్లో పూర్తి స్థాయి అధికారం దక్కించుకుని తిరుగులేని పార్టీగా దశాబ్దకాలంగా ఉంది. మణికొండలో అధికారం లేక పోయినా స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు సానుకూలంగా మసులుకునే పాలక కమిటీ ఉండటంతో ఏ ఇబ్బంది రాలేదు. ప్రస్తుతం ఇక్కడ కాంగ్రెస్ బలపడుతోంది.

- కాంగ్రెస్‌కు కంచుకోటగా బండ్లగూడ
- నార్సింగిలో కూలిన బీఆర్‌ఎస్ కోట
- శంషాబాద్‌లోనూ మొదలైన బీటలు


నార్సింగి మున్సిపల్ కార్యాలయం

మణికొండ: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటంతో నియోజవర్గంలో బీఆర్‌ఎస్ బీటలువారుతోంది. అప్పటి వరకు బీఆర్‌ఎస్‌కు కంచుకోటగా ఉన్న మున్సిపాలిటీలు కాంగ్రెస్ పరమవుతున్నాయి. మొదటగా బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మెజార్టీ స్థాయిలో 16 మంది కార్పొరేటర్లు పార్టీ మారటంతో బీఆర్‌ఎస్‌కు అప్పటి వరకు ఉన్న బలం కాంగ్రెస్ పక్షానికి మారింది. దీంతో మేయర్ పీఠం సైతం ఇటీవల కాంగ్రెస్ ఖాతాలోకి వచ్చింది. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో బీజేపీ మద్దతుతో చైర్మన్ పదవిని దక్కించుకున్న కాంగ్రెస్ ఇటీవల అవిశ్వాసం పెట్టినా ప్రతిపక్షాలకు సరైన బలం లేకపోవడంతో వీగిపోయింది.

నార్సింగిలో నేడు చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ల ఎన్నిక

నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ ఎన్నికల సమయంలో 8 మంది సభ్యులు ఉండగా అనంతరం ఇద్దరు పార్టీలు మారటంతో ఆరుకు పడిపోయింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావటంతో ఏకంగా సభ్యుల సంఖ్య 12కు పెరిగింది. మరో ఇద్దరు బీజేపీ కౌన్సిలర్లు సైతం వారికి మద్దతుగా నిలవటంతో ఏకంగా 18 మంది 14 మంది బలంతో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాసం పెట్టి ఇటీవల వారిని పదవీచ్యుతులను చేశారు. శుక్రవారం జరిగే ప్రత్యేక సమావేశంలో నూతన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుని ఇక్కడా కాంగ్రెస్ జెండాను ఎగరవేస్తున్నారు.

ఎంపీ గ్రూపు ఖాళీ...

నియోజకవర్గంలో గతంలో బీఆర్‌ఎస్ పార్టీలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి గ్రూపులుగా పార్టీ నిర్మాణం ఉండేది. ఎంపీ ఎన్నికల సమయంలో ఆయన కాంగ్రెస్‌లో చేరటంతో ఆయనతో సన్నిహితంగా ఉన్న వారంతా ఆయన వెంటే కాంగ్రెస్ పార్టీలో చేరి ఆయన గెలుపుకోసం పనిచేశారు. కొందరు పార్టీ మారకపోయినా గెలుపు కోసం కృషి చేశారని వినికిడి.

ఎమ్మెల్యే వర్గమే..

ప్రస్తుతం బీఆర్‌ఎస్ పార్టీలో కొనసాగుతున్న వారు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ వర్గంగా నిలుస్తున్నారు. వారిలోనూ కొందరు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులతో పాటు ప్రభుత్వ పెద్దలకు టచ్‌లోకి వెళ్తున్నారు. ఎంపీ ఎన్నికల ఫలితాలు వచ్చాక ఎక్కువ మంది బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

బలపడుతున్న కాంగ్రెస్..

బీఆర్‌ఎస్ కోట కూలి కాంగ్రెస్ కోట నిర్మాణానికి పునాదులు పడనున్నాయి. ఇక మిగిలిన శంషాబాద్ మున్సిపాలిటీలోనూ ఇప్పటికే 6 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. మిగిలిన మరికొంత మందిని చేర్చుకుని జూన్ నెలాఖరు లోపు కాంగ్రెస్ జెండా ఎగురవేసే దిశగా అడుగులు పడుతున్నాయనే సమాచారం. అదే తరహాలో శంషాబాద్ మండలంలోని మెజార్టీ మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలను కాంగ్రెస్‌లో చేర్చుకునేలా ఎత్తుగడలు వేస్తున్నారు.

330 గ్రాముల గంజాయి పట్టివేత


స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

పటాన్‌చెరు టౌన్: 330 గ్రాముల గంజాయి పట్టుకున్నారు ఎక్సైజ్ పోలీసులు. ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్ గౌడ్ తెలిపిన వివరాలు ప్రకారం... పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామంలో ఓ వ్యక్తి స్కూటీపై గంజాయి విక్రయిస్తున్నాడని సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి బుధవారం రాత్రి దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో గంజాయి విక్రయిస్తున్న నందిగామ గ్రామానికి చెందిన వంశీ వద్ద నుండి 330 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, అతని స్కూటీని సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కమీషనర్ అభిలాష అభినవ్ ఇంజనీరింగ్ అధికారులు, డిసిలు, టౌన్ ప్లానింగ్ అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్త డంపింగ్ ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో చెత్త వేయకుండా సిబ్బందిని నియమించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అదే విధంగా నాలాల్లో చెత్త వేయకుండా నిరోధించాలన్నారు. చెత్తను తరలించేందుకు అవసరమైతే మరిన్ని వాహనాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కాలుష్య కారకాలైన వాణిజ్య, పారిశ్రామిక సంస్థలకు నోటీసులు జారీ చేసి, అవసరమైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. నాలా పరిశుభ్రత కోసం ఆధునిక పరికరాలను ఉపయోగించుకోవాలన్నారు.